# గుడ్డివాడు



యస్. సరోజినీ కమలాకర్.

డాక్టర్ మాధవరావు యం. బి. బి. యస్. చదువుతున్న రోజుల నుండే అంగవైకల్యంగల వారన్నా, కురూపులన్నా, దీర్ఘ రోగులన్నా చాలా అసహ్యించుకొనేవాడు. చిరాకుపడేవాడు. అటువంటి వారంటే అతనికి ఎలర్జీ.

'ఇలాంటి వారివలన ప్రపంచానికి కలిగే లాభం ఏమిటి? వారి వలన ఇతరులకు విచారం, శ్రమ తప్ప మరే ప్రయోజనం లేదు. వారి జీవితాలను మందులతో పొడిగించడం వృధా ప్రయాసే అవుతుంది. వారికి మందులుపోసి వారి

జపితాల్ని పొడిగించేకన్నా, వారి వట్టకు వారిని చనిపోనివ్వడమే వివేకమైన పని' అని డాక్టర్ మాధవరావుగారి నిశ్చితాభిప్రాయం.

"జబ్బులను నయం జేయడానికే గదా డాక్టర్లు వున్నది. రోగాలున్న వారినందరినీ చంపుతుంటే యిక వారి డాక్టర్ల అవసరమేమిటి?" అని స్నేహితులు ప్రశ్నించేవారు. దానికి సమాధానంగా—

"డాక్టర్లు కుదర్చగలిగిన వ్యాధులకు మాత్రమే మందులిచ్చి ప్రయత్నం చేయాలి. దీర్ఘవ్యాధులు గల వారిమీద, అంగవికలుల మీద జాలిపడి విలువైన మందులను, కాలాన్ని వృధా చేయడం అనవసరం. అది వైద్య వృత్తి ఆశయం కూడా కాదు" అని మాధవరావు చాలా ఎమోషనల్‌గా వాదించేవాడు.

మాధవరావు ఏ విషయాన్నీ ఆలోచించకుండా మాట్లాడేవాడు కాదు. అందువలన అతని స్నేహితులు అతని అభిప్రాయాలను ఎక్కువగా వ్యతిరేకించేవారు కాదు.

ఒకరోజు మాధవరావు మెటర్నిటీ వార్డులో డ్యూటీలో ఉండగా బయట హోరున వర్షం కురవడం ప్రారంభించింది. వురుములు మెరుపులతో వర్షం ఎక్కువై భీభత్సంగా తయారయ్యింది. ఆ వర్షంలో నెలలు నిండిన ఒక గర్భిణీ స్త్రీని నడిపించుకొని యిద్దరు చిన్నపిల్లలు మెటర్నిటీ వార్డుకు వచ్చారు. ఆ గర్భిణీ స్త్రీ, తోడుగా వచ్చిన యిద్దరు పిల్లలు తడిసి ముద్దలై పోయారు. మాధవరావు డ్యూటీ టైము కూడా అయిపోవచ్చింది. ఇంతలో కాన్పు చెయ్యవలసిన కేసు రావటంతో అతనికి చాల చిరాకు, కోపం కూడా వచ్చాయి.

"ఏయ్! యింతవర్షం కురుస్తోంటే ఎలా వచ్చావు? కాసేపు ఆగి రాలేక పోయావా? అయినా నిండు మనిషివి యిలా వర్షంలో తడుస్తూ ఎందుకొచ్చావు?" అని గర్భిణీ స్త్రీని గదమాయించాడు మాధవరావు.

"బాబూ! దిక్కులేనిదాన్ని. నాకు రిక్షా కట్టించుకొనే స్తోమతకూడా లేదు. నా బాధను చూడలేక, వద్దన్నా వినకుండా నా పిల్లలే యిలా వర్షంలో తీసుకువచ్చారు. నా బాధ తగ్గించు బాబూ! పుట్టే బిడ్డకు నీ పేరే పెట్టుకుంటాను" అని దీనంగా వాపోయింది. ఆమె మాటలు నీరసంగా, నూతిలోనుండి వస్తున్నట్టుగా వున్నాయి.

'లేబరు రూము' లోనికి వెళ్ళిన పావుగంటలోనే ఆమెకు పురుడు వచ్చింది. పుట్టిన మగపిల్లవాడికి

ఒక కాలు మామూలు సైజులోనే వుంది. కాని రెండవ కాలు మాత్రం ఉండవలసిన సైజులో సగం మాత్రమే ఉంది.

అలవాటు ప్రకారం ఆ పసి కందు నోటిలో నోరుపెట్టి ఊది శ్వాసకలిగించబోయి ఆ పసికందు రెండో కాలివైపు చూసి ఒక్క-క్షణం ఆగాడు మాధవరావు.

'ఈ బిడ్డ యింత అంగవైకల్యంగా పుట్టాడు. ఏ సర్జన్‌గాని, ఏ మందుగాని, ఏ వైద్య శాస్త్రం గాని యితన్ని మామూలు బిడ్డను చేయలేవు. జీవితమంతా యితనికి 'కుంటివాడు' అనేపేరు స్థిరపడు తుంది. ఇంతటి అంగవైకల్యం గల యితడు పెరిగినా ఎవరిని ఉద్ధరించగలడు? తల్లిదండ్రులకు, తోబుట్టువులకు, సంఘానికి, తద్వారా ప్రపంచానికి బరువుతప్ప యితని జీవితం నిరుపయోగం. ఇతన్ని బ్రతికించడం వలన ప్రయోజనం ఏమన్నా ఉందా?' అన్న ఆలో చనలు మాధవరావు మనసులో మెరిసాయి.

కాని, తాను డాక్టరు. తనకు తెలియకుండానే బిడ్డకు శ్వాస పోశాడు. ఆ పసికందు కెవ్వున కేక వేసి అరవడం మాధవరావుకు అంత ఆనందాన్ని కలిగించలేదు.

ఈ కాన్పు పూర్తి అయ్యేసరికి అతని డ్యూటీ టైముకూడా అయి పోయింది. మెడికల్ బ్యాగ్ సర్దు కొని బయటకు వస్తూ, ఎందుకో చలికి వణుకుతూ నిలబడ్డ యిద్దరు పిల్లల్ని చూసి—

"మీ అమ్మకు యిది ఎన్నో కాన్పు?" అని ప్రశ్నించాడు.

"పదో కాన్పు బాబూ!" అని సమాధానమిచ్చింది ఆ యిద్దరిలోని చిన్న పిల్ల భయపడుతూ.

మాధవరావుకు ఈ మాట విన్న తరువాత తానేదో చేయరాని నేరం చేసినట్లు అనిపించింది. తాను అనవసరంగా జాలి చూపి, తన అభిప్రాయాలకు విరుద్ధంగా ఒక అవిటి వానికి ప్రాణంపోసి, ప్రపంచానికి ఒక క్రొత్త బరువు కట్టబెట్టానన్న బాధ పట్టుకుంది. ఇలా బాధపడుతూనే కారెక్కి-యింటికి వెళ్ళిపోయాడు.

* * *

కాలం గడిచింది.

డాక్టరు మాధవరావు మొదట పనిచేస్తున్న పెద్ద హాస్పిటల్ నుండి రాజీనామా చేశాడు. ఒక మధ్య తరగతి పట్నంలో స్వంత ప్రాక్టీసు ప్రారంభించి రెండు చేతులా ధనార్జన చేశాడు. ధనంతో బాటు మంచి డాక్టరు అన్న పేరు

ప్రతిష్టలు అతనికి తెలియకుండానే లభించాయి.

అందరిలాగే మాధవరావు జీవితం ఆశనిరాశల సమ్మిశ్రిత మంటే ఆశ్చర్య పడనక్కరలేదు. అతని కొడుకు, కోడలు, భార్య భయంకరమైన రైలు ప్రమాదంలో మరణించారు. ఒక్క రబ్బరు బొమ్మవంటి మనుమరాలు తప్ప 'నా' అన్న వాళ్ళెవరూ మిగలలేదు. అతనికి జీవితమే ఎంతో భారంగా తయారయ్యింది. అందర్నీ ఆ మనుమరాల్లో చూస్తూ. ఆమెకోసం జీవించడం, ఆర్జించడం అలవాటు చేసుకొన్నాడు.

ఒకరోజు మాధవరావు గారి మనుమరాలు స్కూలు మధ్యలో యింటికి వచ్చింది. అప్పటికి మాధవరావు యింట్లోనే ఉన్నాడు. ఎన్నడూ స్కూలు మధ్యలో ఇంటికిరాని మనుమరాలును చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏం తల్లీ, వచ్చేశావు! ఏం కావాలి?" అన్నాడు.

"తాతగారండి! నాకు ఒంట్లో బాగులేదండి. తలలో ఏదో సూదులు గ్రుచ్చుకున్నట్లుందండి. చేతులు, కాళ్ళు కాలిపోతున్నాయి, నాకు బాగులేదండి" అంది భయం భయంగా కన్నీళ్ళు పెట్టుకొని.

"ఇలా రా తల్లీ" అని దగ్గరకు తీసికొని పరీక్షగా చూశాడు. 'కొంపదీసి పోలియో కాదుగదా!' అనుకున్నాడు. ఎన్ని పరీక్షలు చేసినా అతనికేమీ అర్థంకాలేదు. వ్యాధి కారణం తెలియలేదు. వైజాగ్ తీసుకువెళ్ళి తనకు తెలిసిన స్పెషలిష్టులతో పరీక్ష చేయించాడు. పరీక్షలవలన తేలిన విషయ మేమంటే ఆ పాపకు 'మెదడు వాపు వ్యాధి' సోకిందని. వెంటనే ఢిల్లీలో ఉన్న 'ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసన్'కు తీసికెళ్ళమని. ఆలస్యం చేస్తే ప్రమాదమని గట్టిగా వార్నింగ్ కూడా యిచ్చారు.

మనుమరాలు రోజు రోజుకు పడుతున్న బాధ భరించలేక పోయాడు క్లినిక్ మూసివేసి, మనుమరాలిని తీసికొని ఢిల్లీ బయలు దేరాడు. ఢిల్లీలో మాధవరావుకు తెలిసిన ఒక యం.పి. సహాయంతో మనుమరాలికి అన్ని పరీక్షలు త్వరగా పూర్తి చేయించాడు. చివరకు అది మెదడు వ్యాధేనని, చాల ముదిరిపోయిందని, ఈ స్థితిలో చేయగలిగింది ఏమీ లేదని చెప్పారు డాక్టర్లు.

మాధవరావుతో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇలా

అన్నాడు- "డాక్టర్! మిమ్మల్ని డిస్కరేజ్ చేయడం నాకు యిష్టం లేదు. ఇక్కడ మీ మనుమరాలికి మేమేమీ చేయలేకపోయినందుకు విచారిస్తున్నాం. ఈ మధ్య బెంగుళూరులో మా స్నేహితుడు మెదడు వ్యాధిగురించి పరిశోధనలు చేశాడు. అతనికి ప్రపంచ ఆరోగ్యసంస్థ బహుమతి కూడా లభించింది. అతని ఎడ్రసు ఇస్తాను. ప్రయత్నించండి."

ఎడ్రసు తీసుకొని మనుమరాలితో, వెంటనే విమానంలో బెంగుళూరు చేరుకున్నాడు.

అడ్రసు ప్రకారం బెంగుళూరులో క్లినిక్ చేరుకున్నాడు.

ఆ ఉదయం మాధవరావుగారిదే మొదటి అపాయింట్‌మెంట్. మనుమరాలిని తీసుకొని లోపలకు వెళ్ళి, డాక్టరుగారి టేబులు దగ్గర కూర్చున్నాడు. డాక్టరు ప్రక్కగదిలో నుండి ఎక్స్‌రే చేతో పట్టుకొని వచ్చాడు. ఆయన్ని చూడగానే మాధవరావు ఆశ్చర్యపోయాడు. డాక్టరు 'కుంటివాడు.' మాధవరావు తన కాలివైపే దీక్షగా చూడటం గమనించిన డాక్టర్-

"గుడ్‌మార్నింగ్ మాధవరావుగారూ! నా కాలువైపు ఆశ్చర్యంగా చూస్తున్నారేమిటి? నాకు ఒక కాలు పొట్టిదండి. పుట్టినప్పటి నుండే అది అలా ఉంది. నన్ను అందరూ 'కుంటిడాక్టరు' అని పిలుస్తారు. మా అమ్మ నాకు పురుడు పోసిన డాక్టరు మాధవరావుగారి పేరు పెట్టినా, 'నన్ను మాత్రం ఎవ్వరూ 'డాక్టర్ మాదవయ్య' అని పిలవరు. నాకు కూడా వాళ్ళు పిలిచినట్లు 'కుంటివాడు' అన్నపేరే సహజమనిపిస్తుంది" అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

మాధవరావుకు పాతిక సంవత్సరాల క్రితం....రాత్రి పూట.... హోరున వర్షం కురుస్తుంటే.... దిక్కులేని గర్భిణీ స్త్రీ....ఇద్దరు చిన్నపిల్లలు....తాను పడిన చిరాకు ..అన్నీ స్మృతిపథంలో మెరిసాయి.

'జీవితమంతా కుంటివాడన్న పేరు మాత్రం ఖాయం. ఇంతటి అంగవైకల్యంతో ఇతడు ఎవర్ని ఉద్ధరిస్తాడు' అన్న తన అనుమానం కూడా జ్ఞప్తికి వచ్చింది.

ఒక్కసారిగా మాధవరావు కుర్చీలోనుండి లేచి అతని చేతులు పట్టుకొని, "మాధవయ్యగారూ! మీరు కుంటివారేగాని నేను కళ్ళుండి కూడా గ్రుడ్డివాణ్ణి" అన్నాడు.

కుంటి డాక్టర్, మాధవరావు చెప్పిన మాటల్లోని అంతరార్థం గ్రహించలేక ఆశ్చర్యంగా అతని వైపు చూశాడు. *